ప్రజాశక్తి

సోమవారం 15 ఏప్రిల్ 2024

I

అల్లూరి సీతారామరాజు



విద్యతోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని వైజాగ్ కింగ్స్ రౌండ్ టేబుల్ 213 స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సత్యదేవ్ తెలిపారు. మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు విద్య, ఆరోగ్యం, ఉపాధి పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం డుంబ్రిగుడ ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతిగృహ బాలుర, బాలికల విద్యార్థులకు 12 పరుపులను అందజేశారు. గిరిజన విద్యార్థుల శ్రేయస్సుకు సంస్థలు తోడ్పాటు నందించేందుకు సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ చంద్రశేఖర్, సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యదేవ్

గుంతల రోడ్లతో తిప్పలు


- అవస్థలు పడుతున్న పర్యాటకులు
- ఇదీ అరకులోయ రహదారి దుస్థితి

ప్రజాశక్తి-అరకులోయ: పర్యాటక రంగంలో దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతులు గాంచిన అరకులోయ రోడ్లు అస్తవ్యస్తంగా ఉండటంతో పర్యాటకులు, వాహన దారులు అవస్థలు పడుతున్నారు. పర్యాటక కేంద్రంగా అరకులోయ అభివృద్ధి చెందుతుందని ఇటు పర్యాటకశాఖ అధికారులు అటు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చెబుతున్నా మాటల్లో మాత్రం వాస్తవం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

అరకులోయ మండల కేంద్రంలోని వైఎస్ఆర్ జంక్షన్ నుంచి పర్యాటక శాఖ మయూరి అతిథి గృహానికి వెళ్లే రహదారి పూర్తిగా మరమ్మత్తుకు గురైంది. సుమారుగా రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ రోడ్డు మరమ్మతుకు గురై పూర్తిగా గోతులమయం కావడంతో ఇటు స్థానికులకు, అటు పర్యాటకులకు, వాహనచోదకులకు నిత్యం అవస్థలు తప్పలేదు. చిన్నపాటి చినుకులు పడితే వాహన చోదకులు ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే నానా అవస్థలు పడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. వర్షం కురిస్తే వర్షపు నీటితో నిండి అస్తవ్యస్తంగా మారుతోంది. దీంతో, నిత్యం ఈ రోడ్డు గుండా ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు, పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గతుకులుగా ఉన్న రహదారిపై వెళుతున్న వాహనం




రెస్టారెంట్ వద్ద గోతులుగా ఉన్న రోడ్డు

ఈ రోడ్డు మార్గంలోనే ఐటిడిఏ అధికారులు, వీఐపీ అతిథి గృహానికి, ఆర్టీసీ కాంప్లెక్స్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ఉన్నత స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు మయూరి అతిథి గృహంలోనే బస చేస్తుంటారు. అయినా ఈ రోడ్డుకు మోక్షం మాత్రం కలగలేదు. దశాబ్దం క్రితం గతంలో అప్పటి గవర్నర్ నరసింహన్ అరకులోయ పర్యటనతో రాత్రికి రాత్రి నామమాత్రంగా తాత్కాలికంగా రోడ్డు వేసిన అధికారులు చేతులు దులుపుకున్నారు. వేసిన ఆ రోడ్డు నెల రోజులు తిరక్క ముందే యథాస్థితికి చేరుకోవడంతో ప్రయాణికులకు, పర్యాటకులకు ఇబ్బందులు తప్పలేదు. ఈ రోడ్డును మరమ్మతు చేయాలని స్థానికులు, పర్యాటకులు, మోటార్ యూనియన్ ప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు అరకులోయను సందర్శించిన ఉన్నతాధికారులకు, మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. అధికారులు రోడ్డుని బాగు చేయాలని పలువురు కోరారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 133 జయంతి ఆదివారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. అల్లూరి జిల్లా కలెక్టర్ విజయ సునీతతో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పాడేరు జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట్, సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం భావితరాలకు దిక్సూచిగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జనార్ధన్, జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు, తహసిల్దార్ కళ్యాణ్ చక్రవర్తి, ఎస్‌డబ్ల్యూ అనందరాజు, కన్నబ్బాయి పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న కలెక్టర్

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో అల్లూరి జిల్లాలో అంబేద్కర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్ శ్రీను మాట్లాడుతూ, బాబాసాహెబ్ అంబేద్కర్ దళిత బలహీన బడుగు వర్గాలకు చెందిన ప్రజల కోసం ఎంతో పోరాటం చేశారన్నారు.ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు చిన్నారావు, కమిటీ మెంబర్స్ దిలీప్, హరికృష్ణ, ధోని విద్యార్థులు పాల్గొన్నారు..

రాజ్యాంగ రక్షణే అంబేద్కర్‌కు నిజమైన నివాళి

-సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి అప్పలనర్స

పాడేరు:జిల్లాలో సీపీఎం ఆధ్వర్యంలో అంబేద్కర్ 133 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాడేరు మండలంలో మినుములూరు కాఫీ కొలనీలో సీపీఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి అప్పలనర్స అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బడుగు బలహీనర్గాల వర్గాల ఆశాజ్యోతి, ప్రపంచమేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి అంబేద్కర్ అని కొనియాడారు. అట్టడుగు వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడంతో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బిజెపికి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటన చేసిందన్నారు.బిజెపి ప్రభుత్వం ఉపాధి కల్పించకపోగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడమే కాకుండా ఆదాని, అంబానీలకు కట్టబెడుతుందని విమిర్శంచారు.బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సుందరరావు, వసంత కుమారి, వరలక్ష్మి, దేవి కాఫీ కార్మికులు కాంతమ్మ, భీమరాజు,ప్రకాష్, లక్ష్మణరావు, బాలేశ్వరరావు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న అప్పలనర్స

ఏజెన్సీలో అంగన్‌వాడీ కేంద్రాలకు..

సకాలంలో సరుకులు సరఫరా చేయాలి

ఎపి అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ డిమాండ్

ప్రజాశక్తి:అరకులోయ:అల్లూరి జిల్లా గిరిజన ప్రాంతంలో అంగన్వాడి కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార సరుకులు సకాలంలో సరఫరా చేయాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు.గిరిజన ప్రాంతం ఇంటర్నెట్ సౌకర్యం సక్రమంగా లేని కారణంగా థంబ్ పద్ధతి , ఫేస్ యాప్‌లను రద్దు చేయాలన్నారు. అరకులోయ గిరిజన సంఘం కార్యాలయంలో యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆన్లైన్‌తో అంగన్వాడీ టీచర్లు, లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నవంబర్ నుండి పప్పు, నూనె జిల్లాలో ఎక్కడా అందలేదని పేర్కొన్నారు. 42 రోజుల సమ్మె పోరాటం మరువలేనిదని, రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి అనేక సమస్యలు పరిష్కరించుకుని ఆరు రకాల జీవోలు విడుదల చేయించుకున్న ఘనత అంగన్వాడి యూనియన్‌దే అని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు లొంగకుండా విరోచితంగా పోరాడిన అంగన్వాడీలకు అభినందనలు తెలిపారు.

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ,రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, రిజర్వేషన్లతో గిరిజన ప్రాంతంలో ఎంతో మంది లబ్ధి పొందుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉన్న హక్కులను రిజర్వేషన్లు రద్దు చేయాలని కొన్ని దుష్టశక్తులు చూస్తున్నాయని విమర్శించారు. భవిష్యత్తులో రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు జరిగే పోరాటంలో మనందరం ముందుండాలని పిలుపు నిచ్చారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంగన్వాడీల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దుర్గా నాగమ్మ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కే.భాగ్యలక్ష్మి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కళావతి, పెంటమ్మ, పి.వెంకటలక్ష్మి, కొండమ్మ, చిన్నారి, నరసమ్మ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.బి. పోతురాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్బరావమ్మ


అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభిస్తున్న తహశీల్దార్ కృష్ణజ్యోతి

ప్రజాశక్తి -రంపచోడవరం : ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాలను స్థానిక అగ్నిమాపక కేంద్రంలో ఆదివారం రంపచోడవరం తహశీల్దార్ ఎ.కృష్ణజ్యోతి ప్రారంభించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు నివారణ చర్యలపై అవగాహనకు ఫ్లెక్సీలను కరపత్రాలను ఆవిష్కరించారు. స్థానిక కేజీబీవీ పాఠశాలలోని పిల్లలకు ఫైర్ సిబ్బంది కరపత్రాలను పంపిణీ చేశారు.' అగ్ని ప్రమాదాల నివారణపై వారం రోజులు రంపచోడవరంలో ప్రయోగాత్మకంగా ప్రజలకు చేసి చూపిస్తామనిలో ఫైర్ ఆఫీసర్ ఎస్ గంగన్నదొర తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణకు విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన ఫైర్‌సిబ్బందికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎల్ఎఫ్ఇ బి రామచంద్రరావు, ఆర్ వెంకన్న, జె నాగేశ్వరరావు విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

150 మందికి ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు.

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని తంటికొండ గ్రామ సచివాలయం వద్ద అంజు కంటి ఆసుపత్రి కాకినాడ వైద్య నిపుణులు తేజ, రూహి ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ ఆగూరి సుబ్బలక్ష్మి పర్యవేక్షణలో ఆదివారం కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 150 మంది రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు, వారిలో 20 మందికి కంటి ఆపరేషన్లు, 25 మందికి కంటి అద్దాలు అవసరమని నిర్ధారించారు. కార్యక్రమంలో అంజు కంటి ఆసుపత్రి మేనేజర్ స్వామి వందనం, సీనియర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ వి సూర్య నారాయణ, ఆసుపత్రి సిబ్బంది, గ్రామస్తులు పల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై దాడి : ఏడుగురు అరెస్ట్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని జడ్డింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల పేకాట శిబిరాలపై జడ్డంగి ఎస్ఐ రఘునాధరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం దాడులు నిర్వహించారు, వనకరాయి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పట్టుకుని, వారి వద్ద నుండి రూ 10,200 నగదును, అలాగే జడ్డింగి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న మరో ముగ్గురు వ్యక్తులను పట్టుకొని వారి నుంచి రూ5వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.

అరాచక పార్టీలను ఓడించండి

● ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించండి : వి.వెంకటేశ్వర్లు



సిపిఎం అభ్యర్థులకే ఓటేస్తామని నినదిస్తున్న సున్నంవారిగూడెం గిరిజనులు

ప్రజాశక్తి- విఅర్‌పురం:- వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అరాచకాలు, దౌర్జన్యాలు, అవినీతికి పాల్పడే అభ్యర్థులను ఓడించాలని సిపిఎం మండల కమిటీ పిలుపు నిచ్చింది. ప్రజల కోసం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆదివారం సున్నంవారిగూడెం గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలోనాయకులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ గ్రామంలోకి అవినీతి, అరాచక పార్టీల అభ్యర్థులను రానివ్వబోమని, అనంతబాబును రానివ్వకుండా చూడాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు సిపిఎం అభ్యర్థులకే తమ ఓటు వేస్తామని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ మాట్లాడుతూ. పోలవరం నిర్వాసితులకు సర్వేలు చేసి ప్రజల్ని మభ్య పెట్టారని, ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించి జిఒ3ను పదేళ్లుగా పెండింగ్‌లో ఉంచారని, తునాకాకు బోనస్, అంతర్గత రోడ్లు అభివృద్ధి, బోయవాల్మీకులను, బెంతు ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చడం వంటి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. గిరిజన సమస్యలు పరిష్కారం కావాలంటే, యువతకు ఉద్యోగావకాశాలు కావాలంటే రంపచోడవరం నియోజకవర్గంలో సిపిఎం అభ్యర్థి లోతా రామారావును గెలిపించాలని కోరారు.

ప్రజల పక్షాన పోరాడే ఏకైక పార్టీ సిపిఎం : రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

రంపచోడవరం : ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేసి, సాధించే సత్తా వామపక్ష పార్టీలకే ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం రంపచోడవరం మండలంలోని బాలకొండ, సుప్రభాతం చెరువూరు గ్రామాలలో సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి బొప్పన కిరణ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్ల వాణిశ్రీలతో కలిసి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు గ్రామాల ప్రజలు సిపిఎం నాయకులకు తమ సమస్యలను విన్నవించారు. రహదారి సమస్య ప్రధానంగా ఉందని, ఇప్పటివరకు టిడిపి వైసిపి నేతలు పలుమార్లు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసినా పనులు జరగలేదన్నారు.

ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిస్వార్ధంగా ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి, వాటి పరిష్కారానికి సిపిఎం, ఇతర కమ్యూనిస్టు నేతలకే సాధ్యమన్నారు. గిరిజనుల ఓట్లతో గెలిచిన ఇతర పార్టీల నేతలు మైదాన ప్రాంతాల్లో నివాసాలు ఉంటూ మన్యవాసుల గోడు పట్టించుకోలేదన్నారు. ప్రజల కోసం పోరాడుతూ ప్రజల మధ్యనే ఉండే సిపిఎం నాయకుడిని ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని కోరారు. అనంతరం సిపిఎం రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కిరణ్ మాట్లాడుతూ అధికారంలో ఉన్న లేకున్నా ప్రజా సమస్యలపై పోరాడే ఏకైక పార్టీ సిపిఎమ్‌కు మాత్రమే సొంతమన్నారు. సిపిఎం అభ్యర్థి లోతా రామారావును గెలిపిస్తే, గిరిజనుల సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పి మాట్లాడే నాయకుడు ఒకరు ఉంటారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శాంతి రాజు వంతల రాంబాబు ఈతపల్లి లింగారెడ్డి పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న సిపిఎం నేత వి.వెంకటేశ్వర్లు

టిడిపి సీనియర్ నేత రాంబాబు మృతి



రాంబాబు మృతదేహానికి నివాళులర్పిస్తున్న వంతల రాజేశ్వరి

ప్రజాశక్తి-ఎటపాక : నందిగామపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చంద్ర రాంబాబు మృత్యువాత పడ్డారు. ఆయన భౌతిక దేహానికి రంపచోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాంబాబు లేని లోటు తెలుగుదేశం పార్టీకి పూడ్చలేనిదని,వారి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. రాంబాబు కుటుంబానికి మనోధైర్యాన్ని సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో కూనవరం మాజీ జెడ్‌పిటిసి కన్యకా పరమేశ్వరి, మాజీ ఎంపిపి పోడియం అప్పారావు, గడేసుల ప్రేమ చందు, తోటకూరి వెంకటేశ్వరరావు, ఐటిడిపి మీడియా కోఆర్డినేటర్ రసూల్, బీసీ సెల్ మాజీ అధ్యక్షులు సోమక సత్యనారాయణ పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూంలో ఇవిఎంలు భద్రం



కంటైనర్లలో వచ్చిన ఇవిఎంలు వివి ప్యాడ్లు పరిశీలిస్తున్న ఇఆర్ఒ, ఇతర అధికారులు

ప్రజాశక్తి - రంపచోడవరం : వచ్చే సార్వత్రిక ఎన్నికలకు జిల్లా కేంద్రం పాడేరు నుంచి వచ్చిన ఇవిఎంలు, వివి.ప్యాడ్‌లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూములో భద్రపరచడం జరిగిందని రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక బాలురు వసతి గృహం ప్రాంగణంలో పాడేరు నుండి రంపచోడవరం నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు.. వివి ప్యాడ్లు రెండు కంటైనర్లలో వచ్చాయి. అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్, రంపచోడవరం,అడిషనల్ ఎస్పీ జగదీష్ సమక్షంలో రెండు కంటైనర్లలో వచ్చిన వాటికి సీల్ వేసి, స్ట్రాంగ్ రూములలో భద్రపరిచారు.

ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి యస్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రంపచోడవరం, చింతూరు డివిజన్లోని 11 మండలాలలో 399 పోలింగ్ కేంద్రాలకుగాను 518 చొప్పున ఇవిఎంలు, వివి ప్యాడ్లు., బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లు వచ్చాయన్నారు. వీటిని భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. స్ట్రాంగ్ రూమ్ పరిధిలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికి అనుమతి ఉండదన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎ.కృష్ణజ్యోతి, ఎండి నజీమ్ ముల్లాస్, ,డిప్యూటీ తాసిల్దార్లు ఎన్ వివి సత్యనారాయణ, బి. రాజు, చైతన్య, శ్రీధర్, విశ్వనాథం, శివ, మూర్తి, సిఐలు వి. వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్ రావు, వివిధ రాజకీయ పార్టీల నేతలు పి.శ్రీనివాసరావు,కె. బాలకృష్ణ, యస్.బొజ్జి రెడ్డి, యం.వాణిశ్రీ, చుక్క. సంతోష్ కుమార్ , సీనియర్ సహాయకులు టి. లక్ష్మణరావు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

వంద మందికి వైద్యపరీక్షలు

ప్రజాశక్తి- రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరంలో 200 మందికి వైద్యసేవలు అందించినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. వైద్య శిబిరాన్ని రామకృష్ణ మఠం కార్యాలయ ఇన్‌ఛార్జి స్వామి వేదవిద్యానంద మహారాజ్ పర్యవేక్షించారు.వైద్యశిబిరంలో డాక్టర్ దాసరి ఉమమహేష్. డాక్టర్ రాయుడు శ్రీనివాస్, డాక్టర్ ఎస్. సంపత్‌కుమార్ పాల్గొని రోగులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు. 49మందికి రక్తపరీక్షలు, ముగ్గురికి థైరాయిడ్ పరీక్షలు, ఇద్దరికి ఇసిజి, 11మందికి ఫిజియోథెరపీ, 11మందికి ఎక్స్‌రే పరీక్షల చేసినట్లు స్వామీజీ తెలిపారు. రామకృష్ణ మిషన్ అందిస్తున్న ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ కోరారు. పరమహంస యోగానంద నేత్రలయం వేమగిరి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించి, 40మందికి కంటి పరీక్షలు చేశారు.ఎనిమిదిమందికి కంటి అద్దాలు అందించారు.కంటి ఆపరేషన్ కోసం 17మందిని పరమహంస యోగానంద ఆసుపత్రికి తరలించారు. శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్,నక్కా చంటిబాబు, వాలంటీరు వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు, .రోగులు, సహాయకులకు భోజన సదుపాయం కల్పించారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-యంత్రాంగం

అరకు లోయ : అంబేద్కర్ జయంతి సందర్భంగా సిపిఎం నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, బిజెపి ,ఆర్ఎస్ఎస్, శక్తుల నుండి భారత రాజ్యాంగాన్ని కాపాడటానికి దేశంలో ఇండియా కూటమి ఏర్పడిందన్నారు.ఆదివాసుల గిరిజనుల హక్కులు, చట్టాలు రక్షణ, మతోన్మాద శక్తులను అడ్డుకోవడం కోసం భారతదేశ ప్రజలందరూ ఐక్యం కావాలని సురేంద్ర పిలుపునిచ్చారు.ప్రతి ఎన్నికల్లో మతం పేరుతో అధికారం కోసం ప్రచారం చేస్తున్న బిజెపిని ఓడించాలన్నారు. ప్రాంతీయ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు తిరస్కరించాలని పిలుపునిచ్చారు.స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ పరం చేస్తూ ప్రత్యేక హెూదా, రైల్వే జోన్, రెండు కోట్ల ఉద్యోగం వంటి హామీలను అమలు చేయని బిజెపితో వివిధ ప్రాంతీయ పార్టీలు జతకట్టి ఆంధ్ర రాష్ట్రాన్ని తీవ్ర అన్యాయం చేయడానికి పూనుకోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు, కిల్లో జగన్నాథం, పొద్దు బాలదేవ్, ఎస్‌బి పోతురాజు అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండలంలోని శరభగూడ గ్రామంలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు కిల్లో జగన్నాథం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి బాలదేవ్ మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయాల సాధనకు అంకితమై పనిచేయాలన్నారు. నూతన విద్యా విధానం పేరుతో ఆదివాసి ప్రాంతంలో ఆదివాసులను విద్య నుండి దూరం చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు, శరభగూడ గ్రామం గిరిజన సంఘం నాయకులు మొంగు నాయుడు, నిరంజన్, కోటి, కార్తీక్, జానకి, నైనా లక్ష్మణ్, కళ్యాణ్, రాజు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: అంబేద్కర్ జయంతిని స్థానిక మండల కేంద్రంలో వివిధ సంఘాలు, పలు పార్టీల నాయకులు ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి మహేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి ఎస్.బాలకృష్ణ, ఆ సంఘం నాయకులు ఏం.మోహన్ రావు, ఎల్‌బి దిక్కులు అంబేద్కర్ విగ్రహానికి నివాళు లర్పించారు. స్థానిక అల్లూరి యూత్, వైసిపి, టిడిపి నాయకులు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో అల్లూరి యూత్ మండల అధ్యక్షుడు కే.సూర్య ప్రకాష్, వైసిపి నాయకులు ఎస్.ఆనంద్, వి.వెంకట్రావు, టిడిపి మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు, కే సుబ్బారావు, నిరీక్షణరావు, అంబేద్కర్ యువజన సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: స్థానిక అంబేద్కర్ పార్క్ వద్ద అంబేద్కర్ జయంతిని మండల అంబేద్కర్ సేవ సంఘం, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో జి.మాడుగుల సర్కిల్ ఇన్స్పెక్టర్ రమేష్, స్థానిక ఎస్సై కె.రవీంద్ర పాల్గొని


అరకులో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. తొలుత నాలుగు రోడ్ల కూడలి నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

పెదబయలు: మండల కేంద్రంలో అంబేద్కర్ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షులు చెండా బీమసుందర్‌రావు మాస్టారు అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పూర్వపు సంఘ అధ్యక్షులు అప్పారావు, కార్యదర్శి పి ఫాల్గుణ, సిపిఎం మండల కార్యదర్శి బోండా సన్నిబాబు, సభ్యులు బట్టి నాగేశ్వర్‌రావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

హుకుంపేట: స్థానికి పెట్రోల్ బ్యాంక్ వద్ద అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం నుంచి పోలీసు స్టేషన్ వరకు ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నారావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి టి కృష్ణారావు, వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు పాల్గొన్నారు.

అరకులోయ: మండల కేంద్రంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అరకులోయ అంబేద్కర్ సేవా సంఘం ప్రతినిధులు సాంబశివరావు, వికాస్, లైకోన్, గోవర్ధన్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అంబేద్కర్ ఆశయాలు కొనసాగిస్తామని నినాదాలు చేశారు. వైఎస్ఆర్సిపి అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం నివాళులర్పించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు.

అనంతగిరి: మండలంలోని కొండిబా పంచాయతీ సింగర్‌బ గ్రామంలో ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేశారు. మాతృభూమి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకొని మాతృభూమి సేవా సంస్థ ప్రతినిధులు గోపాలరావు, నాగేష్‌లు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గంగరాజు, సీపీఎం నాయుడు ఎస్ నాగులు, టోకురు సర్పంచ్ కిల్లో మొస్య, మాజీ సర్పంచ్ దొన్ను పాల్గొన్నారు

చింతూరు : భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకొని చింతూరు సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం చింతూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు సీసం సురేష్, పల్లపు వెంకట్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం కుల మత ప్రాంతీయ జాతి బేధాలు లేకుండా అభివృద్ధి సాధించేందుకు భారత రాజ్యాంగం నిర్మించుకున్నామని, దేశ ప్రజలకు నిమ్న జాతులకు హక్కులు కల్పిస్తూ రాజ్యాంగంలో అంబేద్కర్ ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. నేడు కేంద్రంలోని బిజెపి మతోన్మాద విధానాలతో హిందుత్వ ఏజెండాతో దళితులు క్రిస్టియన్స్ మైనారిటీలపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. మళ్లీ 2024 అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని లౌకిక విధానాన్ని రద్దు చేస్తామని బహిరంగంగానే బిజెపి నాయకత్వం మాట్లాడటం ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదమన్నారు ఈ నేపథ్యంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని పిలుపునిచ్చారు. నిర్వాసితులు ఆదివాసీలు సమస్యలపై పోరాడే ఇండియా ఫోరంలోని వామపక్షాలు, కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాండు నాగార్జున్, పల్లపు రాములు, కారం రాజయ్య, దూలయ్య, రామారావు, నాగేష్ పాల్గొన్నారు.

విఆర్.పురం : స్థానికసిపిఎం కార్యాలయం బొప్పిన భీమయ్య భవన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి సిపిఎం నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం. చిన్నబాబు మండల కమిటీ సభ్యులు పంకు సత్తిబాబు, గిరిజన సంఘం నాయకులు కారం సత్తిబాబు, రేకపల్లి పార్టీ నాయకులు నాల్లరపు ప్రకాశరావు, సిరపు తాతబాబు సోడి మల్లయ్య, ఆజరత్, చింతకాయల నాగు, జెట్టి రాజు, పిఎన్ఎమ్ నాయకులు సిహెచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని టేకులబోరు గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం. సీతారామయ్య, తాళ్లూరి శ్రీనివాసరావు, కొండా ఈశ్వర్లు, వెంకన్నబాబు, ఏడుకొండలు, వీరబాబు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీలేరు: ఏపి జెన్‌కో కార్యాలయంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎపి జెన్‌కో ఎస్ఇ కెకెవి.ప్రశాంత్‌కుమార్, ఇఇ లక్ష్మీనారాయణ, ప్రభాకర్ జ్యోతి ప్రజ్వళన చేసి, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత, సంఘ సంస్కర్త అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌సి,ఎస్టీ ఇ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు కార్యదర్శి జె .ప్రసాద్ ఎపి జెన్కో ఇంజనీర్ నాగబాబు సబ్ ఇంజనీర్ శ్రీధర్ అకౌంట్ ఆఫీసర్ ఈవివి. సత్యనారాయణ కార్మిక సంఘ నాయకులు వై .సత్తిబాబు శివ ప్రసాద్, డిఎవి పాఠశాల హెచ్ఎం ఓం నమశ్శివాయ, జెన్కో కార్మికులు ఎంపిటిసి పిల్లా. సాంబమూర్తి బిజెపి నాయకులు కె..అప్పలరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం గ్రామంలో అంబేద్కర్ చిత్రపటానికి ఎపి జెన్‌కో సిఇఒ బొడ్డు శ్రీధర్, డిఇఇ బాలకృష్ణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పింఆచరు. రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అలుపెరగని కృషి చేశారని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగిద్దామన్నారు. వేడుకలలో మోతుగూడెం ఎస్ఐ గోపాలరావు, కెవిపిఎస్ రాష్ట్ర సహాయక కార్యదర్శి కె.క్రాంతి బాబు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి సీనియర్ ఉపాధ్యాయులు బొడారపు కృష్ణ, సిఐటియు నాయకులు పలివెల వీరబాబు, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎం బుజ్జి, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు, అనంతరం రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ,ప్రజా సంఘాలు, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఎస్ అచ్చారావు, టి శ్రీను, రామరాజు, పి కిరణ్, నాగు, జి పెద్దిరాజు, బి త్రిమూర్తులు, సీహెచ్ కుమారి, వి అప్పారావు, వి చిన్నబ్బాయి, పి బాబురావు పాల్గొన్నారు.

రంపచోడవరం : స్థానిక ఐటిడిఎ కార్యాలయపు సమావేశపు హాలులో అంబేద్కర్ చిత్రపటానికి ఐటిడిఎ పరిపాలన అధికారి డిఎన్‌వి రమణతో పాటు వివిధ శాఖల అధికారులు సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిఇఇ చైతన్య, సీనియర్ అసిస్టెంట్లు పి. వెంకటేశ్వరరావు, కె. రాజారెడ్డి, జూనియర్ సహాయకులు పి. లక్ష్మీరెడ్డి, శివ, జె.విల్సన్, కె. సోమిరెడ్డి, కె.రాంబాబు పాల్గొన్నారు.

ఎటపాక : మండలంలో ఎటపాక, నెల్లిపాక, తోటపల్లి, గుండాల కాలనీ, లక్ష్మీపురం కేంద్రాల్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు.కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్, జెడ్‌పిటిసి ఉబ్బా సుస్మిత, దేగల మాధవరావు, జి హరనాథ్, వర్స బాలకృష్ణ పాల్గొన్నారు.

చింతూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహానికి ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్ పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం సాంఘిక సంక్షేమ హాస్టల్ వార్డెన్ తాతాజీతో కలిసి బాలుర హాస్టల్‌ను సందర్శించి అక్కడ విద్యార్థుల సమస్యలు పరిశీలించారు. జెకె సిటి ట్రస్టు తరుపున సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

నేరాలు ఘోరాలు

కాఫీ, మిరియాల తోటలు దగ్ధం

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని వెంగడ పంచాయతీ గోమంగిపాడు గ్రామంలో కాఫీ, మిరియాల తోటలు దగ్ధమ య్యాయి. గ్రామానికి చెందిన కేరంగి అర్జున్ అనే రైతుకు చెందిన ఎకరం తోటలో ఆదివారం మధ్యాహ్నం సమ యంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో తోట పూర్తిగా దగ్ధమైంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపరిహారం చెల్లించడమే కాకుండా ఉపాధి హామీ పథకం ద్వారా తోట పెంచేందుకు నిధులను మంజూరు చేయాలని రైతు కోరాడు. సంవత్సరానికి లక్షా 50 నుండి 3 లక్షల ఆదాయం వచ్చేదని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

రంగా హత్య తరహాలోనే జగన్‌పై దాడి

-ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-చింతపల్లి: హింసా రాజకీయాలకు చంద్రబాబు నాయుడు బ్రాండ్ అంబాసిడర్ అని వైసిపి జిల్లా అధ్యక్షులు, పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిపై రాళ్ల దాడిని ఖండించారు. స్థానిక విలేకరులతో భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, కాపు ఉద్యమనేత వంగవీటి రంగాను ఏ మాదిరిగా చంద్రబాబునాయుడు హత్య చేయించారో ఆ తరహాలోనే జగన్మోహన్ రెడ్డిపై దాడి జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఇటువంటి వ్యక్తి ప్రతిపక్షంలో ఉండడం దురదృష్టకరమన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డిపై దాడి జరగడం బాధాకరమన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మేమంతా సిద్ధం బస్సుయాత్రకు లభిస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఈ తరహా దాడులకు దిగుతున్నాయన్నారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ దాడిపై ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు శ్రీకాంత్ రాజు, జడ్పిటిసి పోతురాజు బాలయ్య పడాల్, ఎంపీపీ అనూష దేవి, సర్పంచ్ దురియ పుష్పలత, మండల ప్రెసిడెంట్ రవి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, మండల కోఆప్షన్ మెంబర్ నాజర్ వలి, వైస్ ఎంపీపీ వెంగళరావు శారద, లలిత పాల్గొన్నారు.

ఫ్లెక్సీలో మార్చని గత కలెక్టర్ ఫొటో

కలెక్టరేట్ ఆవరణలోనే విచిత్రం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరేట్ ప్రాంగణం, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఫ్లెక్సీ బోర్డుల్లో బదిలీపై వెళ్లిన కలెక్టర్ ఫొటో ఉండటం విశేషం. ప్రజలను బాల్య వివాహాల నిషేధ చట్టం-2006పై చైతన్యం పర్చేందుకు బేటి బచావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు వద్దు చదివే ముద్దు అనే శీర్షికతో ఫ్లెక్సీలను ప్రభుత్వం కలెక్టరేట్ ప్రాంగణంలో, జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసింది. ఈ ఫ్లెక్సీ బోర్డులపై జిల్లా ఎస్‌పి ఫొటోతో పాటు అప్పటి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఫొటో ఉంది. ఎన్నికల నేపథ్యంలో బదిలీపై వెళ్లి రెండు నెలలైంది. అయినా ఇప్పటికీ గత కలెక్టర్ ఫొటోలను ఫ్లెక్సీలపై నుంచి తొలగించలేదు.

చింతపల్లిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-చింతపల్లి: అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆర్అండ్‌బి కార్యాలయం ఆవరణలో చేయూత వారియర్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ సెంటర్, (విశాఖపట్నం) సహకారంతో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక పాత్రికేయులు రక్తదానం చేశారు.

విరబూసిన కాఫీ

ప్రజాశక్తి- అనంతగిరి: మండలంలోని కాఫీ తోటలు విరబూశాయి. పూత చెట్టు నిండా ఎంత బాగా పూస్తే అంతే దిగుబడి, ఆదాయం లభిస్తుందని రైతులు తెలిపారు. గత సంవత్సరం పూత సరిగా రాలేదని, ఈ ఏడాది బాగా వచ్చిందని కాఫీ రైతులు ఆనంద పడుతున్నారు. గత ఏడాది తొలకరీ వర్షాలు జనవరి, ఫిబ్రవరి నెల్లలో కురిశాయి. దీంతో, పూత దెబ్బతింది.ఈ ఏడాది వర్షాలు కురవక పోవడంతో ఏప్రిల్ నెల రెండో వారంలో కాఫీ పూత బాగా వచ్చింది. మండలంలోని అనంతగిరి, ఎగువశోభ, టోకూరు, వెంగడ, పైనంపాడు, లుంగపర్తి, కొండిభ, కివర్ల, పెద్దకోట, కోనాపురం గ్రామాలలో కాఫీ, మిరియాలు తోటలు సాగు చేస్తున్నారు. ఒక్కొక్క రైతు 1 నుండి 5 లోపు ఎకరాలు రైతులు సాగు చేపడుతున్నారు.పూత పూసినప్పటి నుండి సుమారు 8 నుండి 9 నెలలు అక్టోబర్, నవంబర్ నెలల నుండి కాఫీ, మిరియాల పంట రైతులకు చేతికి అందివస్తుంది. ఈ తోటలు అనంతగిరి, అరకు ఘాట్ రోడ్డుకు ఆనుకుని ఉండటంతో పర్యాటకులు తోటల్లో సెల్ఫీలు దిగుతున్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్

రైల్వేలో భద్రతా తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరభ్ ప్రసాద్ ఆదివారం రాయగడ - లడ్డా సెక్షన్‌లో మూడో లైన్ పనులను పరిశీలించారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఆ మార్గంలోని కీలక స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. రాయగడ రైల్వే స్టేషన్‌లో తాగునీటి సౌకర్యాన్ని పరిశీలించారు. మూడో లైన్ పనులు, స్టేషన్ల అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో ఎడిఆర్ఎం (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) సుధీర్ కుమార్ గుప్తా పాల్గొన్నారు.

దక్షిణంలో వాసుపల్లి ప్రచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం అంటే మత్స్యకారుల అడ్డా అని, ఆ విషయాన్ని పవన్ కల్యాణ్ తెలుసుకోవాలని నియోజవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్స్ శ్రీ పోలమాంబ సూపర్ ఫిష్ మార్కెట్‌ను ఆయన సందర్శించి వర్తకులతో కలిసి వ్యాపారం చేశారు. అలాగే మత్స్యకార వ్యాపారులను వరస పెట్టి పిలుస్తూ అక్కడికి వచ్చిన ప్రజలను ఆకట్టుకున్నారు. అక్కడి ఉన్న ప్రతి చేప పేరునూ చెబుతూ ఆశ్చర్యంగొలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బి.రాజు పాత్రుడు, బొడ్డేటి కిషోర్ పాల్గొన్నారు.

నీటిని అందుబాటులో ఉంచండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవి నేపథ్యంలో పశు, పక్ష్యాదులకు తాగునీటిని అందుబాటులో ఉంచాలని గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం కోరారు. ఆదివారం ఉదయం ఆయన ఎంపిపి కాలనీలో మీడియాతో మాట్లాడుతూ మానవాళి మనుగడ సమస్త జీవరాసులతో పెనవేసుకుని ఉందన్నారు.

దువ్వాడ మీదుగా మరిన్ని వేసవి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వేసవి నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఎస్ఎంవి బెంగళూరు - మాల్దా టౌన్, మైసూర్ - ముజఫర్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఇవన్నీ దువ్వాడ స్టేషన్ మీదుగా వెళ్లనున్నాయి. ఈ క్రమంలో 06563 ఎస్ఎంవి బెంగళూరు - మాల్దా టౌన్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 14 నుంచి మే 5 వరకు ప్రతి ఆదివారం రాత్రి 23.40 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు నుండి బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 18.13 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 18.15 గంటలకు బయలుదేరి మంగళవారం సాయంత్రం 16:30 గంటలకు మాల్దా టౌన్ చేరుకుంటుంది. 06564 మాల్దా టౌన్ - ఎస్ఎంవి బెంగళూరు ప్రత్యేక రైలు ఏప్రిల్ 17 నుండి మే 8 వరకు ప్రతి బుధవారం సాయంత్రం 16.00 గంటలకు మాల్దా టౌన్ నుండి బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 15.08 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 15.10 గంటలకు బయలుదేరి శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్ స్టేషన్ల మీదుగా ప్రయాణిస్తాయి.

06221 మైసూర్ - ముజఫర్‌పూర్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 15 నుండి మే 6 వరకు ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటలకు మైసూర్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 07.18 గంటలకు దువ్వాడ చేరుకుని 07.20 గంటలకు బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 13:30 గంటలకు ముజఫర్‌పూర్‌కు చేరుకుంటుంది. 06222 ముజఫర్‌పూర్ - మైసూర్ ప్రత్యేక రైలు ఏప్రిల్ 18 నుండి మే 9 వరకు ప్రతి గురువారం మధ్యాహ్నం 13.00 గంటలకు ముజఫర్‌పూర్ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 19.18 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 19.20 గంటలకు బయలుదేరి శనివారం 16.40 గంటలకు మైసూర్ చేరుకుంటుంది. ఈ రైళ్లు ఈస్ట్ కోస్ట్ రైల్వే మీదుగా దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్ మీదుగా ప్రయాణిస్తాయి.

ప్రజా సమస్యల ప్రస్తావనేదీ ?

ఉక్కు పరిరక్షణపై స్పష్టతనివ్వని చంద్రబాబు

ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీలపై కప్పదాటు వైఖరి

పాయకరావుపేట, గాజువాకల్లో చప్పగా సాగిన ప్రజాగళం సభలు

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి, గ్రేటర్ విశాఖ బ్యూరో, పాయకరావుపేట, గాజువాక విలేకరులు

ఉమ్మడి విశాఖలోని పాయకరావుపేట, గాజువాకల్లో ఆదివారం టిడిపి అధినేత చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం సభల్లో ప్రజా సమస్యల ప్రస్తావనే కానరాలేదు. నియోజకవర్గాల ప్రజలకు భరోసా లభించలేదు. విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణపైనా చంద్రబాబు స్పష్టతనివ్వలేదు. అనకాపల్లి జిల్లాలోని తాండవ, ఏటికొప్పాక సుగర్ ఫ్యాక్టరీలపై కప్పదాటు వైఖరి ప్రదర్శించారు. రెండు సుగర్ ఫ్యాక్టరీలపై తగిన నిర్ణయం తీసుకుంటామని అన్నారు తప్ప అధికారంలోకి వస్తే తెరిపిస్తామని హామీ ఇవ్వలేదు. మూతపడ్డ సుగర్ ఫ్యాక్టరీల విషయమై అంతకు ముందు మాట్లాడిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వంగలపూడి అనిత, సిఎం రమేష్ ప్రస్తావించలేదు. ఎన్ఎఒబి నిర్వాసితులు, మత్స్యకారుల సమస్యలు పరిష్కారిస్తానని చెప్పిన చంద్రబాబు ఆ సమస్యలను ఎప్పటిలోగా పరిష్కరిస్తామనేది మాత్రం స్పష్టత ఇవ్వలేదు. టిడిపి ప్రభుత్వం నుంచి ఈ సమస్యలు కొనసాగుతున్నా ఇప్పటికీ వారికి పరిష్కారం చూపలేదు. ఉపాధి కల్పించే చర్యలు చేపట్టలేదు. నియోజకవర్గంలో హెటిరో, డెక్కన్ కెమికల్ కంపెనీల వ్యర్థాలతో దెబ్బతిన్న మత్స్యకారుల ఉపాధికి రక్షణ కల్పిస్తామనిగానీ, కంపెనీల కాలుష్యం నియంత్రణకు తీసుకోబోయే చర్యలపైగానీ హామీ ఇవ్వలేదు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పరిశ్రమలు రావడం ద్వారా ఈ ప్రాంతం అభివద్ధి జరగాలని సాధారణ వ్యక్తిగా మాట్లాడారు తప్ప నియోజకవర్గ అభివృద్ధికి తమ ప్రభుత్వ కార్యాచరణ ఎలా ఉండబోతుందో చెప్పలేదు. గతంలో ఇచ్చిన రాష్ట్ర స్థాయి సంక్షేమ పథకాలు వల్లె వేయడం తప్ప వెనుకబడ్డ జిల్లా, నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కార్యాచరణ చంద్రబాబు వద్ద ఉన్నట్లు కనిపించలేదు.


పాయకరావుపేటలో జరిగిన ప్రజాగళం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

చంద్రబాబు ప్రసంగంలో పసలేకనేమో వచ్చిన జనం, ఆయన ప్రసంగిస్తుండగా వెనుదిరిగారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన మోడీపై పల్లెత్తు మాట అనలేదు. స్టీల్‌ప్లాంట్ అమ్మకుండా అడ్డుకొని, సొంతగనులు కేటాయించేలా ఒత్తిడి తెస్తామన్న మాట ఇవ్వలేదు. పాయకరావుపేటలో జరిగిన సభలో టిడిపి ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం.రమేష్, జనసేన నాయకులు తోట నగేష్, గడ్డం బుజ్జి, టిడిపి నాయకులు పెద్దిరెడ్డి చిట్టిబాబు, గూటూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు. గాజువాక సభలో టిడిపి ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, జనసేన నాయకులు కోన తాతారావు, గంధం వెంకటరావు, దల్లి గోవింద్‌రెడ్డి, కరణం కనకారావు, బిజెపి నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, కిలారు ముసలయ్య, పలువురు టిడిపి కార్పొరేటర్లు పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్‌పై స్పష్టమైన ప్రకటన చేయని చంద్రబాబుపై పలువురు అసహనం ప్రదర్శించారు. ఆయన ప్రసంగిస్తుండగానే మధ్యలోనే కొంతమంది వెళ్లిపోయారు. కూటమి పార్టీల మధ్య సమన్వయలోపం కొట్టొచ్చినట్టు కనిపించింది.


గాజువాకలో రాయి విసిరిన వ్యక్తి కోసం వెతుకుతున్న పోలీసులు

రాయి కలకలం

గాజువాకలో ఆదివారం సాయంత్రం టిడిపి జాతీయ అధ్యక్షులు, ఎపి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహిస్తున్న 'ప్రజాగళం' సభలో ఆయన ప్రసంగిస్తున్నప్పుడు గుర్తు తెలియని వ్యక్తి రాయి విసిరాడు. సభా వేదిక దగ్గర గల బారికేడ్ల వద్దకు ఆగంతకుడు విసిరిన రాయితో కొద్ది క్షణాలు చంద్రబాబు ప్రసంగాన్ని ఆపారు. దీంతో పోలీసులు రాయి వచ్చిందని భావించిన సభా వేదికకు ఎడమ వైపునకు వెళ్లి ఆచూకీ కోసం ప్రయత్నించారు. ఈ సందర్భంగా బాబు ప్రసంగిస్తూ గతంలో తనపై బాంబులు పడితేనే భయపడలేదని రాళ్లు ఒక లెక్కా ? అని అన్నారు.


కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న మత్స్యకారున్ని పరామర్శిస్తున్న నర్సింగరావు

బోటు ప్రమాద క్షతగాత్రులకు సిహెచ్ఎన్ఆర్ పరామర్శ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కాకినాడ సమీపంలో ఇటీవల బోటు ప్రమాదంలో గాయపడి కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న మత్స్యకారులను సిపిఎం సీనియర్ నాయకులు సిహెచ్.నర్సింగరావు ఆదివారం పరామర్శించారు. ప్రమాదం వివరాలను అడిగి తెలుసుకున్నారు. సరైన వైద్యం అందుతుందా ? లేదా ? అని కనుక్కున్నారు. ఆయనతోపాటు మత్స్యకారులను పరామర్శించిన వారిలో ఎపి మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్ ఉన్నారు. ఇటీవల సముద్రంలో వేటకు వెళ్లిన బోటులో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో గాయపడిన వారిని నేవీ నౌకల్లో చికిత్స నిమిత్తం విశాఖ కెజిహెచ్‌కు తీసుకొచ్చిన విషయం తెలిసిందే. వారిలో ఒకరు కొద్ది రోజుల క్రితం మృతిచెందగా, మిగతా వారు ఇక్కడే చికిత్స పొందుతున్నారు.

మాటల మర్మం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి : విలువల్లేమితో బతుకుతున్నా.. విలువలున్న వారిగా నమ్మించడానికి కొందరు ఉపయోగించే అస్త్రాలే అబద్ధాలు.. అసత్యాలు. ఎన్నికల్లో వీటి వ్యాప్తి, అవసరం ప్రధాన రాజకీయ పార్టీల్లో ఎక్కువగా కనిపిస్తోంది. ప్రజలు మెచ్చుకొనే అభివృద్ధి అంశాలు ఆ పార్టీల వద్దలేక అబద్ధాలు సునాయాశంగా చెప్పనారంభిస్తారు. ఈ ఎన్నికల్లో ఆ తరహా అబద్ధాలే వ్యాప్తిలో వున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ ఇవి మరింత విస్తృతం కానున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన బిజెపి మొదలుకొని, దానితో జతకట్టిన టిడిపి, జనసేన నాయకుల వరకు స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై ఆడుతున్న నాటకాలు, చెబుతున్న కొత్త అబద్ధాలు వింటుంటే ఆ పార్టీల వక్రబుద్ధి, మోసం అర్థంకాక మానవు. అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ మాట్లాడినా, ఆ పార్టీని నెత్తికెత్తుకొని మోస్తున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రసంగం విన్నా, బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి ప్రకటనలు చూసినా కాసింత విశాల హృదయంతో, భావిజీవితం బాగుండాలనుకొనే వారెవరైనా వారి మాటలు, చేష్టలు, దిగజారుడు వ్యాఖ్యలను అసహ్యించుకోకుండా వుండలేరు. ఛీ కొట్టకుండా వుండజాలరు. తెలుగు ప్రజలు, ప్రధానంగా ఉమ్మడి విశాఖ, ఉత్తరాంధ్ర జిల్లా వాసులకు విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ప్రధాన అజెండాగా ముందుకొచ్చింది. దీని భవిష్యత్ రాబోయే ఎన్నికల ఫలితాలపై ఆధారపడివుంది. ప్రధానితో తనకెంతో సాన్నిహిత్యముందని చెప్పుకొనే పవన్ కల్యాణ్‌కు స్టీల్‌ప్లాంట్ అమ్మకపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని ప్రధానిని అడగడానికి నాలుక తిరగలేదు. అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్‌కు రాజ్యసభ ఆరేళ్ల పదవీకాలం సరిపోలేదు. తన చేతిలో వున్నట్లు స్టీల్‌ప్లాంట్ అమ్మకమే ఆపేస్తానని నమ్మలేని మాటలు నేడు ఆయన చెబుతున్నారు. స్టీల్‌ప్లాంట్ వాటాలు అమ్మకుండా మెరుగ్గా నడిపించడానికి కేంద్ర ప్రభుత్వం దృష్టిపెట్టినట్లు చెప్పడానికి ఏ మాత్రమూ పురంధేశ్వరి సంకోచించలేదు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ప్రజలు ఏమనుకుంటారన్న ఆలోచన ఆమెకు వున్నట్లులేదు. ఇవన్నీ వింటుంటే గెలవడానికి చేస్తున్న విన్యాసాలు, మాయ మాటలు, మర్మం మాటలని ఇట్టే తెలిసిపోతుంది. అయినా వారికవేమీ పట్టడంలేదు. కావాల్సిందల్లా ఏ గడ్డికరిచైనా గెలుపే వారికి కావాలి. సహృదయులు, సత్య శోధకులు, అభివృద్ధిని ఆకాక్షించే, సమాజహితాన్ని కాంక్షించే వ్యక్తులు, సంస్థలు, సంఘాలు వాస్తవాలు గుర్తెరిగి వంచకులకు బుద్ధి చెప్పాల్సిన రోజులు సమీపించాయి. ప్రజల కోసం నిరంతరం పనిచేసే, వారి సమస్యలపై పోరాటాలు నిర్వహించే, స్టీల్‌ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం ఉద్యమాలు నడిపే పార్టీ అభ్యర్థులకు ప్రజలు తోడుగా నిలబడాలి. గాజువాక నుంచి బరిలో నిలిచిన సిపిఎం అభ్యర్థి మరడాన జగ్గునాయుడు, పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్న సిపిఐ అభ్యర్థి విమల ప్రజా పోరాటాల్లో మిలితమైన వాళ్లు. ఉద్యమాలు నడిపిన అనుభవం వున్నవారు. అటువంటి వారికి ఈ ఎన్నికల్లో అనుకూలమైన ప్రజాతీర్పు ఇచ్చినప్పుడే ప్రజలకు కొంతైనా మేలు జరుగుతుంది.